సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

శనివారం । 13 । ఏప్రిల్ । 2024



టన్ను చీనీ రూ.41 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో శుక్రవారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.41 వేలు. కనిష్టంగా రూ.20 వేల ప్రకారం క్రయవిక్రయాలు జరిగాయి.



కిలో టమాట రూ.20

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో శుక్రవారం కిలో టమాట గరిష్టంగా రూ.20 మేర ధర పలికింది. మార్కెట్‌కు 180 టన్నుల సరుకు వచ్చింది.



జిల్లా పరిధిలో శుక్రవారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. వేసవితాపం నెలకొంది. గంటకు 6 నుంచి 10 కిలో మీటర్ల వేగంతో పడమటి దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

ఓటరు నమోదుకు 2 రోజులే గడువు

- 14 వరకూ దరఖాస్తుకు అవకాశం



హిందూపురం అర్బన్: ఓటరుగా నమోదుకు ఎన్నికల కమిషన్ ఇచ్చిన గడువులో మరో రెండు రోజులే గడువు మిగిలి ఉంది. సార్వత్రిక ఎన్నికల్లో ఓటు వేసేందుకు ఈ నెల 14వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని ఎన్నికల కమిషన్ సూచించింది. ఈ ఏడాది మార్చి 31వ తేదీకి వయసు 18 ఏళ్లు నిండిన వారు, ఇప్పటి వరకు ఓటరుగా నమోదు కాని వారు దరఖాస్తు చేసుకోచ్చు. అదే జాబితాలో పేరు లేనివారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

అనుబంధ జాబితా..

ఓటరు నమోదుకు ఈ నెల 14 వరకు అందిన దరఖాస్తులను ఈ నెల 25వ తేదీలోపు పరిష్కరించి అర్హులకు ఓటు హక్కు కల్పిస్తారు. ఈ ఏడాది జనవరి 22న విడుదల చేసిన ఓటరు తుది జాబితాకు అనుబంధ జాబితా రూపొందిస్తారు.

ఆన్‌లైన్‌లోనూ దరఖాస్తు చేసుకోవచ్చు..

కొత్తగా ఓటరు నమోదు చేసుకోవాలనుకుంటే... మీ ప్రాంతంలోని బూత్ లెవల్ అధికారి వద్ద దరఖాస్తు (ఫారం-6) ద్వారా నమోదు చేసుకోవచ్చు. అలా కాకున్నా ఆన్‌లైన్ ద్వారానైనా దరఖాస్తు చేసుకోవచ్చు. www. ceo andhra. nic.in లేదా www. nsvp.in వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకునే వీలు కల్పించారు.

దరఖాస్తుల సమాచారం..

ఓటరుగా నమోదుకు ఫారం-6 ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోతో పాటు ఆధార్ కార్డు లేదా జనన ధ్రువీకరణ పత్రం జత చేయాల్సి ఉంటుంది. ఓటరు జాబితాలో ఓటరు తన చిరునామా మార్పునకు ఫారం-8 ద్వారా దరఖాస్తు చేసుకోవాలి

ఓట్ల తొలగింపుకు అవకాశం లేదు..

ఓటర్ల జాబితా నుంచి ఓటర్ల తొలగింపుకు ఇక ఎలాంటి అవకాశం లేదు. ఎన్నికల షెడ్యూల్ విడుదలైనందున ఓట్ల తొలగింపుపై ఎన్నికల సంఘం ఆంక్షలు విధించింది. కాగా ఇప్పటి వరకు ఫారం -7 ద్వారా వచ్చిన దరఖాస్తులు పరిశీలించి ప్రాసెస్ చేస్తారు. ఓటర్ల తొలగింపుకు కొత్తగా ఎలాంటి దరఖాస్తులు స్వీకరించరు.

రూ.2.57లక్షల నగదు సీజ్



నగదును చూపుతున్న పోలీసులు

ధర్మవరం అర్బన్: ఎలాంటి బిల్లులు లేకుండా తీసుకెళుతున్న రూ.2.57 లక్షల నగదును పోలీసులు సీజ్ చేశారు. వివరాలను ధర్మవరం వన్‌టౌన్ సీఐ సుబ్రహ్మణ్యం వెల్లడించారు. ధర్మవరంలోని ఎర్రగుంట వై జంక్షన్ వద్ద శుక్రవారం మధ్యాహ్నం పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో బెంగళూరు రూరల్ జిల్లా హొసకోట మండలం హసిగల్ గ్రామానికి చెందిన కృష్ణమోహన్‌కుమార్ ఎలాంటి రసీదులు లేకుండా రూ.2.57 లక్షలు తరలిస్తూ పట్టుబడ్డాడు. తనిఖీల్లో ఎస్‌ఐ శ్రీనివాసులు, ఏఎస్‌ఐ బాషా, కానిస్టేబుల్ శివకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

రూ.2 లక్షల నగదు పట్టివేత..

హిందూపురం అర్బన్: స్థానిక రహమత్‌పూర్ సర్కిల్‌లో శుకవారం ఉదయం ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు చేపట్టిన తనిఖీల్లో రూ.2 లక్షల నగదు పట్టుబడింది. విజయవాడ నుంచి వచ్చి హిందూపురంలో ఆటోమొబైల్ పరికరాల వ్యాపారం చేస్తున్న రామకృష్ణ ఎలాంటి రికార్డులు లేకుండా రూ.2 లక్షలు తరలిస్తూ పట్టుబడినట్లు డీఎస్పీ కంజాక్షన్ తెలిపారు.

నేడు ఇంటర్ ప్రవేశ పరీక్ష

లేపాక్షి: మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల జూనియర్ కళాశాలల్లో ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశ పరీక్ష శనివారం నిర్వహించనున్నట్లు గురుకుల విద్యాలయాల కన్వీనర్ ప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. లేపాక్షి, టేకులోడు, గుండుమల, గుడిబండ, పేరూరు, నసనకోట కేంద్రాల్లో పరీక్ష నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. పరీక్ష ఉదయం 10 నుంచి 12.30 గంటల వరకు ఉంటుందని, విద్యార్థులు 9 గంటలకే కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. లేపాక్షి 180 (బాలురు), టేకులోడు 180 (బాలికలు), గుండుమల 180 (బాలురు), గుడిబండ 140 (బాలికలు) సీట్లు ఉన్నాయని తెలిపారు. మొత్తం 680 సీట్లుకుగాను 2,233 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారని వివరించారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు.

బాలికలదే పైచేయి

ఇంటర్‌లో బాలికల ఉత్తీర్ణత వివరాలు ఇలా..			
సంవత్సరం	హాజరైన విద్యార్థులు	ఉత్తీర్ణులైన వారు	ఉత్తీర్ణత శాతం
ఫస్ట్ ఇయర్ (జనరల్)	5,249	3,227	63
సెకండ్ ఇయర్ (జనరల్)	4,186	3,350	80
ఫస్ట్ ఇయర్ (ఒకేషనల్)	677	448	66
సెకండ్ ఇయర్ (ఒకేషనల్)	502	420	84
బాలుర ఉత్తీర్ణత ఇలా...			
ఫస్ట్ ఇయర్ (జనరల్)	4,629	2,442	53
సెకండ్ ఇయర్ (జనరల్)	3,269	2,303	71
ఫస్ట్ ఇయర్ (ఒకేషనల్)	580	226	39
సెకండ్ ఇయర్ (ఒకేషనల్)	351	202	58



- ఇంటర్ ఫలితాల్లో సత్తా చాటిన అమ్మాయిలు
- మొదటి సంవత్సరంలో జిల్లాకు 20వ స్థానం
- ద్వితీయ సంవత్సరంలో 13వ స్థానం
- మొదటి సంవత్సరంలో 58 శాతం, ద్వితీయ సంవత్సరంలో 76 శాతం ఉత్తీర్ణత
- మే 24 నుంచి జూన్ 1 దాకా అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు
- ఈ నెల 18 నుంచి 24వ తేదీలోపు ఫీజు చెల్లింపు

పుట్టపర్తి: ఇంటర్ ఫలితాల్లో బాలికలు సత్తా చాటారు. మొదటి సంవత్సరం, రెండో సంవత్సరం రెండింటిలోనూ పైచేయి సాధించారు. శుక్రవారం తాడేపల్లిలోని ఇంటర్ బోర్డు కార్యాలయంలో అధికారులు ఫలితాలు విడుదల చేశారు. మొదటి సంవత్సరంలో 58 శాతం ఉత్తీర్ణతతో రాష్ట్రంలో మన జిల్లా 20వ స్థానంలో నిలవగా, ద్వితీయ సంవత్సరంలో 76 శాతం ఉత్తీర్ణతతో 13వ స్థానంలో నిలిచింది. మొదటి సంవత్సరంలో 9,878 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా, 5,769 మంది విద్యార్థులు (58 శాతం) ఉత్తీర్ణులయ్యారు. అలాగే ద్వితీయ సంవత్సరానికి సంబంధించి 7,447 మంది విద్యార్థులు హాజరుకాగా, 5,653 మంది విద్యార్థులు (76 శాతం) జయకేతనం ఎగురవేశారు. దీంతో ఇంటర్ మొదటి సంవత్సరం ఫలితాల్లో జిల్లాకు 20 స్థానం, ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో 13వ స్థానం దక్కింది.

బాలికల హవా..

మొదటి సంవత్సరం ఫలితాల్లో 5,249 మంది బాలికలకు గాను 63 శాతంతో 3,227 మంది ఉత్తీర్ణులయ్యారు. 4,629 మంది బాలురకు గాను 53 శాతంతో 2,442 మంది ఉత్తీర్ణత సాధించారు. ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో 4,186 మంది బాలికలను గాను 80 శాతంతో 3,350 మంది ఉత్తీర్ణత సాధించారు. 3,269 మంది బాలురకు గాను 71 శాతంతో 2,303 మంది ఉత్తీర్ణత సాధించారు. ఒకేషనల్ ఫలితాల్లో బాలికలే ముందు వరసలో ఉన్నారు. మొదటి సంవత్సరం ఫలితాల్లో 777 మంది బాలికలకు గాను 66 శాతంతో 448 మంది ఉత్తీర్ణులయ్యారు. 580 మంది బాలురకు గాను 39 శాతంతో 226 మంది ఉత్తీర్ణత సాధించారు. ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో 502 మంది బాలికలను గాను 84 శాతంతో 420 మంది ఉత్తీర్ణత సాధించారు. 351 మంది బాలురకు గాను 58 శాతంతో 202 మంది ఉత్తీర్ణత సాధించారు.

మే 24 నుంచి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు

అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు మే 24 నుంచి జూన్ 1 దాకా జరుగుతాయి. రోజూ రెండు విడతలుగా ఉంటాయి. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు ఉంటాయి. ప్రాక్టికల్స్ మే 1 నుంచి 4 వరకు ఉంటాయి. ఈనెల 18 నుంచి 24 వరకు పరీక్ష ఫీజు చెల్లించాల్సి ఉంటుందని ఇంటర్ విద్య అధికారి రఘునాథరెడ్డి, ఆర్ఐఓ సురేష్ తెలిపారు. రీకౌంటింగ్, రీవెరిఫికేషన్, స్కానింగ్ కాపీ కోసం ఈనెల 18 నుంచి 24లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

సేంద్రియ సాగును ప్రోత్సహిస్తాం

- పరిగిలో పర్యటించిన కేంద్ర బృందం
- గొరవనహళ్లిలో పంటల పరిశీలన



రాగి పంటను పరిశీలిస్తున్న అధికారులు

పరిగి: రైతుకు మేలు చేసే సేంద్రియసాగును మరింత ప్రోత్సహించేందుకు తగు చర్యలు తీసుకుంటున్నట్లు కేంద్రం బృందం సభ్యులు తెలిపారు. శుక్రవారం కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి శైలేష్‌కుమార్ సింగ్, అడిషనల్ సెక్రెటరీ చరణ్‌జిత్ సింగ్, రూరల్ డెవలప్‌మెంట్ మిషన్ డైరెక్టర్ గోయల్, విశ్రాంత ఐఏఎస్ అధికారి విజయ్‌కుమార్, అనంతపురం ఉమ్మడి జిల్లాల ప్రాజెక్టు మేనేజర్లు లక్ష్మీనాయక్, రామ్మోహన్ తదితరులు పరిగి మండలంలో పర్యటించారు. గొరవనహళ్లిలో రైతులు సేంద్రియ పద్ధతులతో సాగు చేసిన మామిడి, సపోట, రాగి, మొక్కజొన్న తదితర పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా గంగమ్మ, అనిత, అశ్వర్థనారాయణ, లక్ష్మీ, మల్లేగౌడు, శ్రీకంఠ తదితర రైతులతో మాట్లాడి సేంద్రియ సాగు విధానాలను తెలుసుకున్నారు. ప్రకృతి వ్యవసాయాన్ని రైతులకు లాభసాటిగా మార్చేందుకే తాము అధ్యయనం చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో మండల అధికారులు పాల్గొన్నారు.

12 వేల మందికి పోస్టల్ బ్యాలెట్

- ఎన్నికల విధులకు గైర్హాజరైతే సస్పెండ్ చేస్తా
- కలెక్టర్ అరుణ్‌బాబు



ఈవీఎంల ర్యాండమైజేషన్ ప్రక్రియను తెరపై తిలకిస్తున్న అధికారులు, ప్రతినిధులు

పుట్టపర్తి అర్బన్: ఎన్నికల విధుల్లో 12 వేల మంది ఉద్యోగులు పాల్గొంటున్నారని, వీరందరికీ పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం ఏర్పాటు చేయాలని కలెక్టర్ అరుణ్‌బాబు ఆదేశించారు. శుక్రవారం ఆయన డీఆర్‌ఓ కొండయ్య, ధర్మవరం ఆర్డీఓ వెంకటశివరామిరెడ్డితో కలిసి కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి ఎన్నికల రిటర్నింగ్ అధికారులతో వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... ఎన్నికలు స్వేచ్ఛాయుత వాతావరణంలో నిర్వహించడానికి అధికారులు పూర్తి స్థాయిలో సన్నద్ధం కావాలన్నారు. ఎన్నికల నిర్వహణ కోసం ఏర్పాటు చేసిన వివిధ కమిటీలు ఎన్నికల సంఘం ఆదేశాలను పక్కాగా అమలు చేయాలన్నారు. ఈనెల 18 తర్వాత పూర్తి స్థాయిలో ఎన్నికల ప్రక్రియ ప్రారంభమవుతుందన్నారు. అధికారులంతా సమన్వయంతో పని చేయాలన్నారు. మే 4, 5 తేదీల్లో పీఓలు, ఏపీఓలకు రెండో విడత శిక్షణ కార్యక్రమాలు ఉంటాయన్నారు. మే 7, 8 తేదీల్లో ఓపీఓలకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. అత్యవసర సేవల పోలింగ్ సిబ్బందికి మే 8న శిక్షణ ఇవ్వాలన్నారు. దివ్యాంగులు, 85 ఏళ్ల వయస్సు పైబడిన వారు ఇంటి వద్దే ఓటు హక్కు వినియోగించుకునేందుకు బీఎల్‌ఓలు ఇంటింటికీ వెళ్లి సర్వే చేస్తారన్నారు. పూర్తిగా మంచంపైనే ఉన్న వారు, నడవలేని స్థితిలో ఉన్న వారు ఇంటి నుంచే ఓటు వేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈనెల 20వ తేదీలోపు అన్ని నియోజకవర్గాల నుంచి ఎన్నికలకు సంబంధించి యాక్షన్ ప్లాన్ తనకు అందజేయాలన్నారు. ఈనెల 24, 25 తేదీల్లో ఎన్నికల పరిశీలకులు జిల్లాలో పర్యటించనున్నారని, తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ సందర్భంగా సీ విజిల్, సోషల్ మీడియా ఫిర్యాదులను ఎలా పరిష్కరిస్తున్నారు..? కోడ్ ఉల్లంఘనలపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు అనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఎస్ఎంఎస్, వాట్సాప్, సీ విజిల్, 1950 కాల్ సెంటర్లకు వస్తున్న ఫిర్యాదులపై సత్వరం చర్యలు తీసుకోవాలన్నారు. నగదు, మద్యం, ఇతర సామగ్రి తరలింపుపై నిఘా ఉంచాలన్నారు. వీసీలో జేసీ అభిషేక్‌కుమార్, పెనుకొండ సబ్ కలెక్టర్ అపూర్వ భరత్, పుట్టపర్తి, కదిరి, ఆర్డీఓలు భాగ్యరేఖ, సన్నీ వంశీకృష్ణ, మడకశిర అధికారి గౌరీశంకర్ తదితరులు పాల్గొన్నారు.

శిల్పారామం క్యాలెండర్ల ఆవిష్కరణ..

శిల్పారామం ఆధ్వర్యంలో రూపొందించిన ఉగాది తెలుగు క్యాలెండర్లను శుక్రవారం కలెక్టర్ అరుణ్‌బాబు ఆవిష్కరించారు. ఈ ఏడాదిలో శిల్పారామంలో నిర్వహించనున్న కార్యక్రమాల వివరాలు, శిల్పారాంలోని వసతులు, చూడదగిన ప్రదేశాల గురించి తెలియజేస్తూ క్యాలెండర్‌ను తయారు చేశారు. కార్యక్రమంలో శిల్పారామం ఏఓ రమేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎంల తొలి విడత ర్యాండమైజేషన్ పూర్తి..

సార్వత్రిక ఎన్నికల్లో వినియోగించే ఈవీఎంల తొలి విడత ర్యాండమైజేషన్ పూర్తిచేసినట్లు కలెక్టర్ అరుణ్‌బాబు తెలిపారు. శుక్రవారం ఆయన కలెక్టరేట్ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ర్యాండమైజేషన్ ప్రక్రియను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా చూపించారు. ఎన్నికల కమిషన్ సూచన మేరకు ఈఎంఎస్ 2.ఓ వెబ్‌సైట్ ద్వారా ర్యాండమైజేషన్ పూర్తి చేసినట్లు చెప్పారు. జిల్లాలో ఆరు అసెంబ్లీ, ఒక పార్లమెంట్‌కు సంబంధించిన ఈవీఎంలు, సెంట్రల్ యూనిట్, బ్యాలెట్ యూనిట్, వీవీప్యాట్‌లను పరిశీలించారు. ఈవీఎం పనితీరుపై సభ్యులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ కొండయ్య, ధర్మవరం ఆర్డీఓ వెంకట శివరామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ ప్రతినిధి వేణుగోపాల్‌రెడ్డి, సీపీఎం ప్రతినిధి ఇంతియాజ్, బీజేపీ నుంచి అమర దేవేంద్ర, బీఎస్పీ నాయకులు సుబ్బరాయుడు, దండు నాగరాజు, పెద్దన్న, రామకృష్ణ తదితరులు ఉన్నారు.

కొడవలి పట్టి.. రాగి కోసి



జిల్లాలో ఎన్నికల ప్రచారం ముమ్మరమైంది. ఆయా పార్టీల అభ్యర్థులు వినూత్నంగా ప్రచారం చేస్తున్నారు. ఈ క్రమంలో శుక్రవారం హిందూపురం ఎమ్మెల్యే అభ్యర్థి టీఎన్ దీపిక లేపాక్షి మండలం తిమ్మగానపల్లిలో ప్రచారం నిర్వహించారు. రాగి పొలంలో పనిచేస్తున్న కూలీలతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె.. కూలీలతో పాటు రాగి కోస్తూ ఆకట్టుకున్నారు. - లేపాక్షి:

ఆహారం కలుషితం.. పలువురికి అస్వస్థత



కలుషిత ఆహారం తిని అస్వస్థతకు గురైన వారిని 108 వాహనంలో ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం



ధర్మవరం ఆస్పత్రిలో బాధితులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి

- కుర్లపల్లిలో ఆలయ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఘటన
- కొందరు వృద్ధులు, చిన్నారుల పరిస్థితి విషమం

కనగానపల్లి: దేవాలయం వద్ద జరిగిన అన్నదాన కార్యక్రమంలో ఆహారం కలుషితమై వంద మందికిపైగా అస్వస్థతకు గురయ్యారు. ఈ సంఘటన కనగానపల్లి మండలంలో చోటు చేసుకొంది. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని కుర్లపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన రాముడి గుడిని శుక్రవారం ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తుల ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. స్థానికులతో పాటు చుట్టు పక్కల గ్రామాల నుంచి వచ్చిన ప్రజలు మధ్యాహ్నం అక్కడే భోజనాలు చేశారు. ఆహారం తిన్న తర్వాత కొంతసేపటికి కొందరు వాంతులు, విరేచనాలు చేసుకొని అస్వస్థతకు గురయ్యారు. వారిని సమీపంలోని ధర్మవరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆ తర్వాత కూడా అక్కడ భోజనాలు చేసిన వారిలో చాలా మందికి ఇదే పరిస్థితి కనిపిస్తుండటంతో అధికారులు అప్రమత్తమయ్యారు. ధర్మవరం, మామిళ్లపల్లి, రాప్తాడు, బత్తలపల్లిలోని 108 వాహనాలన్నింటినీ హుటాహుటిన కుర్లపల్లికి పంపించారు. వీటి ద్వారా సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు దాదాపు 60 మందిని ధర్మవరం పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులకు తరలించారు. అలాగే ప్రైవేటు వాహనాల ద్వారా మరో 50 మంది దాకా ధర్మవరం, అనంతపురంలోని ప్రైవేటు ఆస్పత్రులకు తరలించి చికిత్స చేయిస్తున్నారు. అస్వస్థతకు గురైన వారిలో కుర్లపల్లికి చెందిన వృద్ధులు లక్ష్మిరెడ్డి, నారాయణరెడ్డితో పాటు జ్ఞానవి అనే చిన్నారి పరిస్థితి విషమంగా ఉండటంతో ఐసీయూలో ఉంచినట్లు ధర్మవరం ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులు తెలిపారు.

బాధితులకు పరామర్శ..

ధర్మవరం: కలుషిత ఆహారంతో అస్వస్థతకు గురై ధర్మవరం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను ధర్మవరం ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి, రాప్తాడు ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి సోదరుడు తోపుదుర్తి చందు, పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించేలా వైద్యులను ఎమ్మెల్యే కేతిరెడ్డి ఆదేశించారు. అవసరమైన వారికి ఆరోగ్యశ్రీ ద్వారా ప్రైవేటు ఆస్పత్రుల్లో వైద్యం అందించాలన్నారు. వారి వెంట జెడ్పీ వైస్ చైర్మన్ కామిరెడ్డిపల్లి సుధాకర్‌రెడ్డి, ధర్మవరం కౌన్సిలర్లు పెనుజూరు నాగరాజు, గజ్జాల శివ, వైఎస్సార్‌సీపీ నాయకులు చాంద్‌బాషా, ఎస్పీ బాషా తదితరులు ఉన్నారు.

రమణీయం.. రథోత్సవం



విశేష అలంకరణలో కొటిపి గ్రామ దేవత చౌడేశ్వరీదేవి



అశేష భక్తజన సందోహం మధ్య సాగుతున్న చౌడేశ్వరీదేవి రథోత్సవం

- ఘనంగా కొటిపి చౌడేశ్వరీదేవి రథోత్సవం
- భారీగా తరలివచ్చిన భక్తులు

హిందూపురం: మండలంలోని కొటిపి గ్రామంలో వెలసిన చౌడేశ్వరీదేవి అమ్మవారి రథోత్సవం శుక్రవారం కన్నుల పండువగా సాగింది. వివిధ ప్రాంతాల నుంచి వేలాదిగా భక్తులు తరలివరావడంతో కొటిపి గ్రామం కిక్కిరిసింది. ఏటా ఉగాది పండుగ అనంతరం అమ్మవారి ఉత్సవాలు నిర్వహించడం ఆవాయితీగా వస్తోంది. ఈ క్రమంలో శుక్రవారం తెల్లవారుజామునే అమ్మవారి మూలవిరాట్‌ను పట్టువస్త్రాలు, వివిధ పుష్పాలతో అలంకరించారు. ఆకుల తోరణాలు కట్టి తీర్చిదిద్దారు. భారీగా తరలివచ్చిన భక్తులు అర్చనలు, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం అమ్మవారికి విశేష పూజలు చేశారు. అనంతరం అమ్మవారి ఉత్సవమూర్తిని అత్యంత శోభాయమానంగా ముస్తాబు చేసి రథంలో కొలువుదీర్చారు. 'చౌడేశ్వరీ పాహిమాః' అంటూ భక్తులు అమ్మవారిని కీర్తిస్తుండగా రథం ముందుకు కదిలింది. మేళతాళాలతో గ్రామ వీధులు గుండా ఊరేగింపు అనంతరం రథం తిరిగి ఆలయం వద్దకు చేరింది. ఈ రథోత్సవానికి హిందూపురం చుట్టుపక్కల గ్రామాల నుంచే కాకుండా కర్ణాటక, తమిళనాడు తదితర ప్రాంతాల నుంచి కూడా భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. రథోత్సవం సందర్భంగా భక్తులు అమ్మవారికి వడిబియ్యం అందించి మొక్కులు తీర్చుకున్నారు. కొటిపి గ్రామస్తులు బంధువులు, సన్నిహితులను ఆహ్వానించి విందు ఏర్పాటు చేశారు. రాత్రి ఆలయ కమిటీ ప్రత్యేక ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. హిందూపురం రూరల్ సీఐ ఈరన్న ఆధ్వర్యంలో పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

క్లుప్తంగా

విద్యార్థి ఆచూకీ లభ్యం



విద్యార్థిని తండ్రికి అప్పగిస్తున్న ఎస్‌ఐ రాజశేఖర్‌రెడ్డి

నార్పల: మండలంలోని కేసేపల్లిలో ఉన్న ఓ ప్రైవేట్ స్కూల్ నుంచి తప్పించుకుని పోయిన విద్యార్థి ఆచూకీని పోలీసులు పసిగట్టి సురక్షితంగా తల్లిదండ్రులకు అప్పగించారు. వివరాలను ఎస్‌ఐ రాజశేఖరరెడ్డి శుక్రవారం వెల్లడించారు. గుత్తి మండలం తొండపాడు గ్రామానికి చెందిన హరికృష్ణ కుమారుడు రేవంత్‌కుమార్ కేసేపల్లిలోని ఓ ప్రైవేట్ స్కూల్‌లో ఎనిమిదో తరగతి చదువుతున్నాడు. ఉగాది పండగకు సెలవులు కావడంతో గత శనివారం ఉపాధ్యాయులకు తెలిపి స్వగ్రామానికని రేవంత్‌కుమార్ బయలుదేరాడు. సెలవులు ముగిసిన పాఠశాలకు రాకపోవడంతో బుధవారం ఉదయం యాజమాన్యం విద్యార్థి తల్లిదండ్రులకు ఫోన్ చేసింది. తమ కుమారుడు ఇంటికే రాలేదంటూ తల్లిదండ్రులు తెలిపి, వెంటనే పాఠశాలకు చేరుకుని ఆరా తీశారు. అనంతరం ఉపాధ్యాయులతో కలసి అదే రోజు నార్పల పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనపై మిస్సింగ్ కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తులో యాడికిలోని అగాపే చర్చిలో ఉన్నట్లుగా తెలుసుకుని శుక్రవారం ఉదయం స్టేషన్‌కు పిలచుకువచ్చి తండ్రికి అప్పగించారు. విద్యార్థి పట్ల అశ్రద్ధ వహించిన పాఠశాల ఉపాధ్యాయులపై ఎస్‌ఐ రాజశేఖర్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు.

అక్రమంగా కల్లు విక్రయిస్తున్న టీడీపీ నేత అరెస్ట్

కళ్యాణదుర్గం రూరల్: మండలంలోని బోరంపల్లిలో ఎలాంటి అనుమతులు లేకుండా కల్లు విక్రయిస్తున్న ఆ గ్రామ టీడీపీ నేత జయరాంను శుక్రవారం ఉదయం ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు అరెస్ట్ చేశారు. 70 లీటర్ల కల్లు స్వాధీనం చేసుకుని నిందితుడిపై కేసు నమోదు చేశారు. అలాగే కళ్యాణదుర్గం మున్సిపాలిటీ పరిధిలోని ఒంటిమిద్ది - బోరంపల్లి మార్గం మధ్యలో శుక్రవారం ఉదయం ద్విచక్ర వాహనంపై తరలిస్తున్న 480 టెట్రా ప్యాకెట్ల కర్ణాటక మద్యాన్ని సెబ్ పోలీసులు సీజ్ చేశారు. మద్యం తరలిస్తున్న ఒంటిమిద్ది నివాసి గంగాధర్‌ను అరెస్ట్ చేశారు. కాగా, గంగాదర్‌పై పదుల సంఖ్యలో ఇప్పటికే అక్రమ మద్యం కేసులు ఉండడం గమనార్హం. తనిఖీల్లో సెబ్ సీఐ వెంకట్, సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలోకి భారీగా చేరికలు

- ధర్మవరంలోని వివిధ వార్డుల నుంచి 305 కుటుంబాలు చేరిక
- కొత్తచెరువు మండలం గోరంట్లపల్లిలో తుడిచిపెట్టుకుపోయిన టీడీపీ



31వ వార్డు ఇన్‌చార్జ్ తోపుదుర్తి వెంకటరాముడు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కేతిరెడ్డి సమక్షంలో టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిన 215 కుటుంబాలు



14వ వార్డు కౌన్సిలర్ గుజ్జల శివ ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీలోకి చేరిన 90 కుటుంబాలు

ధర్మవరం: పట్టణంలో టీడీపీకి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. టీడీపీకి చెందిన పలువురు వైఎస్సార్‌సీపీలోకి చేరారు. ధర్మవరంలోని 14వ వార్డుకు చెందిన 90 కుటుంబాలు కౌన్సిలర్ శివ ఆధ్వర్యంలో, 31వ వార్డులో 215 కుటుంబాలు వార్డు ఇన్‌చార్జ్ తోపుదుర్తి వెంకటరాముడు ఆధ్వర్యంలో టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరాయి. నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలోకి చేరిన వారిలో నారాయణస్వామి, రామకృష్ణ, మునాఫ్, రాము, వెంకటప్ప, వెంకటలక్ష్మి, బాలగొండ్ల వెంకటరాముడు, పూజారి చౌడయ్య, అంగజాల రామన్న, మల్లెల శ్రీరాములు, రమణ, బంధనాథం శ్రీరాములతో పాటు మొత్తం 305 కుటుంబాల వారున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు కోటిరెడ్డి బాలిరెడ్డి, సీలూరి ప్రకాష్, కౌన్సిలర్లు తోపుదుర్తి రమణమ్మ, నాయకులు పెద్దిరెడ్డి గారి శ్రీనివాసులు, కమాటం శేషాద్రిరెడ్డి, శ్రీశైలం అరవింద్‌గౌడ్, బోయ నర్సింహులు, ఉడుముల రాము, వడ్డే శ్రీన, తీర్థాల రమణ , తొండమాల రవి, అమీర్‌బాషా, సల్లప్ప, కత్తె పెద్దన్న తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేతిరెడ్డి మాట్లాడుతూ... ఎన్నికల్లో పేదల పక్షాన పోరాడుతున్న జగనన్నకు ప్రజలంతా మద్దతు పలకాలని పిలుపునిచ్చారు. పొరపాటున టీడీపీ అధికారంలోకి వస్తే ఒక్క సంక్షేమ పథకాన్ని కూడా పేదలకు అందకుండా చేస్తారన్నారు.

● గోరంట్లపల్లిలో టీడీపీకి ఎదురు దెబ్బ



వైఎస్సార్‌సీపీలో చేరిన గోరంట్లపల్లి వాసులతో ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

పుట్టపర్తి: కొత్తచెరువు మండలం గోరంట్లపల్లిలో టీడీపీకి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. గ్రామంలో టీడీపీకి చెందిన మొత్తం 150 కుటుంబాలు శుక్రవారం ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరాయి. తన క్యాంప్ కార్యాలయానికి చేరుకుని పార్టీలో చేరుతున్నట్లుగా ప్రకటించిన గ్రామస్తులకు కండువాలు కప్పి పార్టీలోకి ఆయన సాదరంగా ఆహ్వానించారు. కాగా, గ్రామంలో అధికంగా బలిజలు ఉన్నారు. టీడీపీ ఆవిర్భావం నుంచి వీరంతా ఆ పార్టీలోనే కొనసాగుతూ వస్తున్నారు. వీరి చేరికతో ఆ గ్రామంలో మొత్తం టీడీపీ తుడిచిపెట్టుకు పోయినట్టైంది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం జగన్ అమలు చేసిన సంక్షేమ పథకాలతో పేదరికం దూరమవుతోందని, రాష్ట్ర సమగ్రాభివృద్ధిని కాంక్షిస్తూ తామంతా మూకుమ్మడిగా వైఎస్సార్‌సీపీలో చేరుతున్నట్లు ప్రకటించారు. పార్టీలో చేరిన వారిలో కృష్ణమూర్తి, గోరంట్ల గురుమూర్తి, తిరుపాలు, తొండమాల గురుమూర్తి, ప్రసాద్, రామప్ప, వెంకటేష్, చలపతి, మురళి, అంజి, రామప్ప, పుల్లప్ప, పెద్దన్న, రమణ, నాగరాజు, ప్రసాద్, ఆనంద్, రాము, గంగాద్రి, రఘు, సాయిరూపతేజ, పవన్‌కుమార్, గురు, చంద్ర, దాదావలి, సాయికుమార్, నరేష్, నిజాం, ఎంకే వెంకటేష్, ఓబులప్ప, గంగులప్ప, నాయక్, చంద్రాయుడు, ఉదయ్ సాయి, వెంకటరమణ, కన్నా, లోకనాథ్, సయ్యద్, ఇమామ్‌సాహెబ్, సోము, చైతన్య, డి.ప్రసాద్, నారాయణమ్మ, సుజాత, సుబ్బలక్ష్మమ్మ, లక్ష్మీదేవి, సునందమ్మ, ప్రమీల, అంజనమ్మ, భాగ్యమ్మ, మహేశ్వరి, ఉమాదేవి, వరాలమ్మ, ధనమ్మ, కృష్ణమ్మ, సర స్వతి, తిప్పమ్మ, ఆదిలక్ష్మమ్మ, పద్మావతి, లక్ష్మమ్మ తదితరులు ఉన్నారు. వీరంతా జెడ్పీటీసీ గంగాదేవి, మటన్ శంకర్ ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. కార్యక్రమంలో దాల్‌మిల్ సూరి, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ఆవుటాల రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● అభివృద్ధికి పట్టం కట్టండి



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి

రాప్తాడు: మండలంలోని పాలచెర్ల గ్రామానికి చెందిన పలువురు టీడీపీ నాయకులు వైఎస్సార్‌సీపీలో చేరారు. శుక్రవారం అనంతపురంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నారు. పాలచెర్లకు చెందిన 8వ వార్డు మెంబర్ దేవర ఎర్రిస్వామి, చిత్రా బాలరాజు, బంగారు ముత్యాలు, బంగారు మూర్తి, చెరుకూరి నాగేంద్ర, కురుబ రంజీత్, పవన్ కుమార్ పార్టీలో చేరారు. వీరికి ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి పార్టీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా మేకలు, గొర్రెల సహకార సొసైటీ చైర్మన్ పసుపుల నరసింహాగౌడ్, వైస్ ఎంపీపీ బోయ రామాంజనేయులు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ జూటూరు శేఖర్, బీసీ సెల్ నాయకులు పసుపుల ఆది, చిత్రా వెంకటేష్, మాజీ సర్పంచులు సదానంద రెడ్డి, బండి శ్రీనివాసులు, వైఎస్సార్‌సీపీ నాయకులు బిల్లే అభిలాష, మధుసూదన్ రెడ్డి, రఘునాథ్ రెడ్డి, చిత్రా లక్ష్మీనారాయణ, లింగమయ్య, ఎర్రిస్వామి, సుమన్, పోతన్న, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ... నియోజకవర్గాన్ని ఆదర్శంగా అభివృద్ధి చేశాం.. ఈ ఎన్నికల్లో అండగా నివాలని పిలుపునిచ్చారు. గత ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చిన నాయకుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. మాట ఇస్తే వెనకడుగు వేయకుండా అమలు చేస్తారన్నారు. గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి సంక్షేమ పథకాలు ఇంటి వద్దకే అందేలా చేస్తున్నారన్నారు. ప్రస్తుతం అమలు చేస్తున్న అనేక సంక్షేమ పథకాలతో పాటు మరిన్ని సంక్షేమ పథకాలు అందాలంటే ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులను గెలిపించాలని ఓటర్లకు పిలుపునిచ్చారు.

విడిపోయిన దంపతులు ఒక్కటయ్యారు



ఒక్కటైన దంపతులతో న్యాయవాదులు

హిందూపురం అర్బన్: ఇద్దరూ ప్రభుత్వోగులే అయినా వివాహమైన కొంత కాలానికే విభేదాలు చోటు చేసుకుని వేర్వేరుగా జీవనం సాగిస్తున్నారు. ఆ తర్వాత భార్య కావాలని భర్త, తనకు భర్త నుంచి విడాకులు కావాలంటూ కోర్టును ఆశ్రయించారు. చివరకు న్యాయవాదులు, కుటుంబసభ్యుల కౌన్సెలింగ్‌తో మనసు మార్చుకుని ఇద్దరూ ఒక్కటయ్యారు. వివరాలు... హిందూపురం మండలం చౌళూరు గ్రామానికి చెందిన నేత్రావతి సచివాలయ డిజిటల్ అసిస్టెంట్‌గా పనిచేస్తోంది. ఆమెకు చిలమత్తూరు మండలం కొడికొండకు చెందిన సీఆర్‌పీఎఫ్ జవాన్ జీపీ సూరితో కుటుంబ పెద్దలు పెళ్లి నిశ్చయం చేసి 2020, జూన్ 10న వేడుకగా వివాహం జరిపించారు. కొంత కాలం సజావుగా సాగిన వీరి సంసారంలో తర్వాత విభేదాలు చోటు చేసుకున్నాయి. దీంతో నేత్రావతి పుట్టింటికి చేరుకుంది. సూరి సైతం చెన్నైలోని తన బెటాలియన్‌లో విధుల్లోకి చేరి పోయారు. ఆ తర్వాత విడాకులు కోరుతూ భార్య కోర్టులో పిటీషన్ దాఖలు చేయడంతో తనకు భార్య కావాలంటూ భర్త సైతం కోర్టును ఆశ్రయించారు. ఈ క్రమంలో ఇద్దరూ క్రమం తప్పకుండా వాయిదాలకు హాజరవుతూ వచ్చారు. ఆ సమయంలో ఇద్దరూ కలసి మాట్లాడుకుంటూ ఒకరి గురించి మరొకరు పూర్తిగా అర్థం చేసుకున్నారు. ఈ క్రమంలోనే న్యాయవాదులు, కుటుంబసభ్యులు నచ్చచెప్పడంతో ఇద్దరూ ఒక్కటయ్యేందుకు అంగీకరించారు. దీంతో శుక్రవారం ఉదయం ఇందిరా పార్క్‌లోని గణేష్ విగ్రహం ఎదుట న్యాయవాదులు, కుటుంబసభ్యుల సమక్షంలో ఇద్దరూ పూల దండలు మార్చుకుని ఇకపై సఖ్యతగా ఉంటామని ప్రమాణం చేశారు. దంపతులు ఒక్కటవ్వడంతో న్యాయవాదులు, ఇరువైపులా కుటుంబసభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

అభివృద్ధి, సంక్షేమమే ప్రచారాస్త్రం



మక్బూల్, నాయకులతో కలిసి మీడియాతో మాట్లాడుతున్న పూల శ్రీనివాసరెడ్డి

కదిరి: అభివృద్ధి, సంక్షేమమే తమ ఎన్నికల ప్రచార అస్త్రమని వైఎస్సార్‌సీపీ కదిరి ఎన్నికల ఇన్‌చార్జ్ పూల శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఆయన తన స్వగృహంలో ఎమ్మెల్యే అభ్యర్థి బీఎస్ మక్బూల్, మాజీ మంత్రి షాకీర్, మాజీ ఎమ్మెల్యే అత్తార్ చాంద్ బాషా, బీసీ సెల్ రాష్ట్ర నేత బత్తల హరిప్రసాద్, జిల్లా అధికార ప్రతినిధి వేమల ఫయాజ్‌తో కలిసి విలేకరులతో మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ అధినేత, ఏపీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని, గత ఎన్నికల సమయంలో ప్రజలకిచ్చిన హామీలు 99.95 శాతం నెరవేర్చారని గుర్తు చేశారు. వలంటీర్ వ్యవస్థను తప్పుబట్టిన టీడీపీ అధినేత చంద్రబాబు ఇప్పుడు వలంటీర్ల వేతనాన్ని పెంచుతానని చెప్పడం హాస్యాస్పదమన్నారు. కదిరిలో మక్బూల్ అహ్మద్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించుకొని హ్యాట్రిక్ విజయం సాధిస్తామని పూల శ్రీనివాసరెడ్డితో పాటు ఇతర ఆ పార్టీ నాయకులు ధీమా వ్యక్తం చేశారు. ఎన్నికల ఇన్‌చార్జ్‌గా పూలను నియమించడం పట్ల మక్బూల్‌తో పాటు ఇతర నాయకులు హర్షం వ్యక్తం చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ నజీమున్నీసా సాదిక్, వైస్ చైర్మెన్ రాజశేఖర్ రెడ్డి, ఆలయ కమిటీ మాజీ చైర్మన్ గోపాలక్రిష్ణ, పలువురు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

'డ్రిప్' దొంగల అరెస్ట్

పెద్దపప్పూరు: రైతులు భూముల్లో ఏర్పాటు చేసిన డ్రిప్ పరికరాలను అపహరించుకెళ్లే ఇద్దరు రెడ్‌హ్యాండెడ్‌గా పోలీసులకు పట్టుబడ్డారు. వివరాలు... పెద్దపప్పూరు మండలం తురకపల్లికి చెందిన దివాకర్‌రెడ్డి, ఖాజాపీరా (బొలెరో యజమాని) శుక్రవారం బొలెరోలో డ్రిప్ పైపులు తరలిస్తుండగా చెర్లోపల్లి సమీపంలో పోలీసులు ఆపి తనిఖీ చేశారు. ఆ సమయంలో ఇద్దరూ తడబడడంతో తమదైన శైలిలో విచారణ చేయడంతో అసలు విషయం వెలుగు చూసింది. చెర్లోపల్లికి చెందిన రైతులు వెంకట్రామిరెడ్డి, శివశంకరెడ్డి పొలాల్లో ఉన్న రూ.1.20 లక్షల విలువ చేసే డ్రిప్ పైప్‌లను చోరీ చేసి తరలిస్తున్నట్లుగా అంగీకరించారు. నిందితులను అరెస్ట్ చేసి, వాహనాన్ని సీజ్ చేసినట్లు ఎస్‌ఐ శరత్‌చంద్ర తెలిపారు.

వైఎస్సార్‌సీపీ విజయం తథ్యం



ర్యాలీగా వెళుతున్న ఎంపీ అభ్యర్థి బోయ శాంతమ్మ, దుద్దుకుంట అపర్ణారెడ్డి

- ఎంపీ అభ్యర్థి బోయ శాంతమ్మ, ఎమ్మెల్యే సతీమణి అపర్ణారెడ్డి
- భారీ ర్యాలీతో పెద్దమ్మకు ఒడి బియ్యం సమర్పణ

కొత్తచెరువు: పెద్దమ్మ స్వామి ఆశీస్సులతో రాష్ట్రంలో మరోసారి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి బాధ్యతలు తీసుకోవడం ఖాయమని హిందూపురం పార్లమెంట్ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి బోయ శాంతమ్మ, పుట్టపర్తి ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి సతీమణి దుద్దుకుంట అపర్ణారెడ్డి స్పష్టం చేశారు. కొత్తచెరువులోని ఇసుకవంక వీధిలో వెలసిన పెద్దమ్మ గుడికి శుక్రవారం ఉదయం వారు ఒడిబియ్యం సమర్పించారు. స్థానిక వైఎస్సార్‌సీపీ నేత దాల్‌మిల్ సూరి ఆధ్వర్యంలో దాదాపు 5వేల మంది మహిళలు, పార్టీ కార్యకర్తలు ర్యాలీగా ఆలయానికి చేరుకున్నారు. అంతకు ముందు వాల్మీకి, శ్రీకృష్ణదేవరాయులు, అంబేడ్కర్, వడ్డె ఓబన్న విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అమ్మవారికి ఒడిబియ్యం సమర్పించిన అనంతరం వారు మాట్లాడారు. రాష్ట్రంలో పేదలు బాగుపడలన్నా, సకాలంలో వర్షాలు కురిసి పంటలు పండాలన్నా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి ముఖ్యమంత్రిగా చేసుకోవాల్సిన బాధ్యత ఎంతైనా ఉందన్నారు. మోసం, నయవంచనకు చంద్రబాబు కేరాఫ్ అడ్రస్ అన్నారు. 14 సంవత్సరాలు రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉన్నా చంద్రబాబు చేసిన అభివృద్ధి అంటూ ఏదీ లేదన్నారు. ఎన్నికల సమయంలో తప్పుడు హామీలతో ప్రజల ముందుకు వచ్చే మోసకారి చంద్రబాబును నమ్మబోరాదన్నారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ యుగంధర్, వైస్ ఎంపీపీ సరళ, పార్టీ మండల కన్వీనర్ జగన్‌మోహన్ రెడ్డి, జెడ్పీటీసీ గంగాదేవి, మాజీ జెడ్పీటీసీ మహాలక్ష్మి, మాజీ ఎంపీపీ నారాయణ, నాయకులు ఆవుటాల రమణారెడ్డి, ఓడీసీ శ్రీనివాసులురెడ్డి, తలమర్ల శ్యాంసుందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు నారేపల్లి సంజీవరెడ్డి, బైరాపురం జనార్దనరెడ్డి, వెంకట్రాముడు, వాల్మీకి శంకర్, అంగడి సత్తి, వెంకటరాముడు, కవిత, సాయిగీత తదితరులు పాల్గొన్నారు.

వీఆర్‌కు కానిస్టేబుల్?

చిలమత్తూరు: స్థానిక పోలీసు స్టేషన్‌లో పనిచేస్తున్న ఓ కానిస్టేబులును వీఆర్‌కు పంపినట్లుగా సమాచారం. రెండు రోజుల క్రితం అర్ధరాత్రి దాటిన తర్వాత 1.30 గంటలకు సదరు కానిస్టేబుల్ కర్ణాటక మద్యం అక్రమ రవాణా చేసేందుకు కారులో వెళుతూ వీరాపురం సమీపంలో ఎస్‌ఐ కంటపడ్డారు. ఆ సమయంలో ఆయన పిలిచినా స్పందించకుండా కారును తిప్పి శరవేగంగా దూసుకెళ్లాడు. అదే సమయంలో అటుగా వచ్చిన ద్విచక్ర వాహనదారుడిని ఆపి కారును వెంబడించే ప్రయత్నం చేశారు. ఆ సమయంలో వాహనం నడుపుతున్న వ్యక్తిని బైక్ ఎవరదని ప్రశ్నించడంతో సదరు కానిస్టేబుల్ పేరు తెలిపాడు. కాగా, ఘటన జరిగిన తర్వాత రెండు రోజులుగా సదరు కానిస్టేబులు విధులకు డుమ్మా కొట్టాడు. విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి ఎస్‌ఐ తీసుకెళ్లడంతో వీఆర్‌కు పంపుతూ ఆదేశాలు జారీ అయినట్లు సమాచారం.

2,380 చీరలు సీజ్

డి.హీరేహాళ్ (బొమ్మనహాళ్): డి.హీరేహాళ్ మండలం ఓబుళాపురం గ్రామ శివారులో ఏర్పాటు చేసిన అంతర్రాష్ట్ర చెక్‌పోస్టు వద్ద 2,380 చీరలను అధికారులు సీజ్ చేశారు. ఈ మేరకు ఎస్‌ఐ గురు ప్రసాదరెడ్డి తెలిపారు. శుక్రవారం వాహన తనిఖీలు చేపట్టిన సమయంలో గుంతకల్లు నుంచి కర్ణాటకలోని హసన్‌కు వెళుతున్న బొలెరో పికప్ వాహనంలో ఎలాంటి అనుమతి పత్రాలు లేకుండా చీరలు తరలిస్తున్నట్లుగా గుర్తించారు. దీంతో చెక్‌పోస్టు పోలీసులు వాహనంతో పాటు చీరలను సీజ్ చేశారు.

సంఘ సంస్కర్త యోగి వేమన

- సాంఘిక దురాచారాలపై గళమెత్తిన విశ్వకవి
- రేపటి నుంచి 4 రోజుల పాటు కటారుపల్లిలో వేమన ఉత్సవాలు



కటారుపల్లి వేమన ఆలయ ముఖద్వారం



వేమన సమాధి



వేమన శిలా విగ్రహం

గాండ్లపెంట: సాంఘిక దురాచారాలు, మూఢనమ్మకాలపై తిరుగుబాటు బావుటా ఎగరేసిన సంఘ సంస్కర్త, విప్లవకారుడు వేమన సాహిత్యం పామరులను సైతం చైతన్యవంతులను చేసింది. నాటి సమాజంలో నెలకొన్న సమస్యలను అనేక కోణాల్లో దర్శించి లోటుపాట్లు, కుతంత్రాలు, అసమానతలు, దోపిడీలపై సరళమైన భాషలో ఎండగట్టిన మానవతావాదిగా ఆయన ఖ్యాతిగాంచారు. అంటరానితనం ఘోర అపరాధమని సాంఘిక విప్లవకారుడిగా ఎలుగెత్తి చాటారు. కులతత్వం, మత మౌఢ్యాన్ని నిరసించిన సంస్కారవాదిగా ఎదిగిన యోగి వేమన ఉత్సవాలు శనివారం నుంచి నాలుగు రోజుల పాటు కటారుపల్లిలో ఘనంగా నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు సిద్ధమయ్యాయి.

వేమన చరిత్ర కదిపితే ఎన్నో కథలు..

వేమన చరిత్రను కదిపితే ఎన్నో కథలు పలకరిస్తాయి. చరిత్రను ఎన్నిసార్లు తవ్వినా ఆయన 'రెడ్డి' కులస్తుడని స్పష్టమైంది. తొలిసారిగా 1839లో చార్లెస్ ఫిలిఫ్ బ్రౌన్ (సి.పి.బ్రౌన్) ద్వారా వేమన పద్యాలు వెలుగు చూశాయని పరిశోధకులు నిగ్గు తేల్చారు. ఎంతో మంది సంఘ సంస్కర్తలు నేటికీ వేమన సాహిత్యాన్ని కొనియాడుతున్నారు. సాంఘిక దురాచారలను ఎండగడుతూ దాదాపు 7 వేలకు పైగా పద్యాలను ఆయన అందించారు. నేటికీ ఈ పద్యాలు లక్షల ప్రజల నోళ్లలో నానుతున్నాయి. డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి పాలనలో రూ. 2 కోట్ల నిధులు మంజూరు చేసి కటారుపల్లిలోని వేమన ఆలయాన్ని పునఃనిర్మించారు. పర్యాటక శాఖ పరిధిలోకి చేర్చి పున్నమి రెస్టారెంట్, విడిది గృహాలను నిర్మించారు. ఆయన తర్వాత సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సైతం వేమన ఆలయాభివృద్ధికి ఎనలేని కృషి చేశారు. ఏటా జనవరి 19న వేమన జయంతిని అధికారికంగా నిర్వహించేలా చర్యలు తీసుకున్నారు.

రేపటి నుంచి ఉత్సవాలు..

ఏటా ఉగాది పండుగ అయిన వారం రోజుల తర్వాత విశ్వకవి యోగి వేమన ఉత్సవాలను నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ క్రమంలో ఆదివారం అర్ధరాత్రి ఆలయ పీఠాధిపతుల ఆధ్వర్యంలో మహాశక్తి పూజతో ఉత్సవాలు ప్రారంభించనున్నారు. రెండో రోజు సోమవారం రాత్రి బండ్ల మెరవణి, పానక పంద్యారం, రాత్రి 9గంటలకు పాటల కచేరి ఉంటుంది. 16న మంగళవారం సాయంత్రం 4 గంటలకు ఉట్ల తిరునాల, రాత్రికి అగ్నిసేవ, 17న బుధవారం రాత్రి 8 గంటలకు స్వామి వారి గొడుగుల మెరవనితో ఉత్సవాలు ముగుస్తాయి. ఉత్సవాలకు ఉమ్మడి జిల్లా నుంచే కాక వైఎస్సార్, కర్నూలు, నెల్లూరు జిల్లాలతో పాటు కర్ణాటక, తమిళనాడులోని పలు ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరుకానున్నారు. ఈ క్రమంలో భక్తులు ఎలాంటి అసౌకర్యాలకు గురికాకుండా నిర్వాహకులు అన్ని చర్యలూ తీసుకున్నారు.

కటారుపల్లికి చేరాలంటే..

కదిరి నుంచి రాయచోటి ప్రధాన రహదారిపై కటారుపల్లిక్రాస్‌కు చేరుకుని గాండ్లపెంట మండలం కటారుపల్లిలోని వేమన ఆలయానికి చేరుకోవచ్చు. అలాగే రాయచోటి వైపు నుంచి వచ్చేవారు గాండ్లపెంట మీదుగా 4 కిలోమీటర్ల దూరం ప్రయాణించి కటారుపల్లి క్రాస్‌లో దిగి అక్కడి నుంచి కిలోమీటరు దూరంలోని వేమన ఆలయానికి చేరుకోవచ్చు.